ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 28.08.2025 సమయం 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో భారీ వర్షాల నేపధ్యంలో సహాయ కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.
2. అత్యంత భారీ వర్షాలతో కామారెడ్డి, మెదక్, నిర్మల్ జిల్లాలు తీవ్రంగా ప్రభావితం అయ్యాయి.
3. వరద పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్షిస్తున్నారు.
4. రాష్ట్రంలోని 16 జిల్లాలకు ఈ మధ్యాహ్నం వరకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ ను, మిగిలిన జిల్లాలకు ఎల్లో ఎలర్ట్ ను జారీ చేసింది.

లీడ్ వర్షాలు

రాష్ట్రంలో అతి భారీ వర్షాల కారణంగా పలు జిల్లాల్లో జన జీవనం అస్తవ్యస్థమైంది. కామారెడ్డి, మెదక్, నిర్మల్, సిరిసిల్ల, నిజామాబాద్ తో సహా పలు చోట్ల భారీ వర్షాలు నమోదు కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారత సైన్యంతో పాటు ఐదు జాతీయ విపత్తు స్పందన దళాలు, 15 రాష్ట్ర విపత్తు స్పందనా దళాలు క్షేత్ర స్థాయిలో ప్రజలకు సహాయ చర్యలు అందిస్తున్నాయి.

కామారెడ్డి జిల్లాలో గత 50 ఏళ్లలో ఎన్నడు లేని స్థాయిలో 44 సెంటీమీటర్లపైగా అతి భారీ వర్షం నమోదు కాగా, నిర్మల్, మెదక్, నిజామాబాద్, సిద్ధిపేట, సిరిసిల్ల జిల్లాల్లో కూడా అతి భారీ వర్షాలు నమోదయ్యాయి. కామారెడ్డిలో గోడ కూడిన ఘటనలో ఒకరు మరణించారు. నీళ్ల కట్ట వాగులో ఇద్దరు ప్రయాణిస్తున్న కారు కొట్టుకుపోయిందని అధికారులు వెల్లడించారు. రామేశ్వరపల్లి వద్ద రైలు ట్రాకు కూలిపోగా, జాతీయ రహదారిపై పలుచోట్ల రోడ్డు కొట్టుకుపోవడంతో పలుచోట్ల రాకపోకలు నిలిచిపోయాయి.

ఎమ్.ఎస్.ఎల్

కామారెడ్డి – వర్షాలు

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా నిన్నటి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.కామారెడ్డి, బీడీపేట్, రాజంపేట్, నిజాంసాగర్, ఎల్లారెడ్డి, మాచారెడ్డి మండలాలు తీవ్రంగా ప్రభావితం అయ్యాయి. 500 మంది కంటే ఎక్కువమందిని రక్షణ దళాలు సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. కామారెడ్డి పట్టణంలో కూడా పలు నివాస ప్రాంతాలు జలమయం అయ్యాయి. నిజాంసాగర్, పోచారం సాగునీటి ప్రాజెక్టులలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో పలు గ్రామాలు నీట మునిగాయి. మరిన్ని వివరాలు మా ప్రతినిధి రాజ్‌కుమార్ దేశ్‌ముఖ్ అందిస్తున్నారు.

Voicecast:

*గత 50 ఏళ్ళలో ఎన్నడూ లేనంతగా ఒక్కరోజులో 44 సెంటీమీటర్ల మేర కురిసిన అత్యంత భారీ వర్షాలకు కామారెడ్డి జిల్లాలో జనజీవనం అతలాకుతలం అయింది. పట్టణంలోని*

*హౌసింగ్‌బోర్డ్, GR కాలనీ, బతుకమ్మ కుంట, అయ్యప్ప టెంపుల్, లోయాంటీ పలు నివాస కాలనీలతో పాటూ, జిల్లాలోని పలు మండలాలు ముంపునకు గురయ్యాయి. కామారెడ్డి చెరువు పొంగి పొర్లుతోంది. NDRF, SDRF, ఫైర్ సేఫ్టీ, మున్సిపల్, రెవెన్యూ బృందాలు వరద ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ ఉదయం వరకు 800 మందిని మూడు పునరావాస కేంద్రాలకు తరలించారు. వారికి ఆహారంతో పాటూ కనీస అవసరాలను అందిస్తున్నారు. నిజాంసాగర్ ఆనకట్ట నుంచి రెండున్నర లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసేందుకు యోచిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ చెప్పారు. భారీ వర్షాల నేపథ్యంలో అన్ని విద్యాసంస్థలకు ఈరోజు సెలవు ప్రకటించారు.*

పిటిసి కామారెడ్డి

మెదక్ – వర్షాలు

మెదక్ జిల్లా వ్యాప్తంగా నిన్నటి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు హవేలి ఘంపూర్, పాపన్నపేట్, రామాయంపేట్, శంకరంపేట్ నిజాంపేట్ మండలాలు తీవ్రంగా ప్రభావితం అయ్యాయి. పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధాన రహదారులు కొట్టుకపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లాలోని దుద్య గిరిజన తండా పూర్తిగా నీటిలో మునిగిపోయింది. వీరికి జిల్లా అధికారులు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. మరిన్ని వివరాలు మా ప్రతినిధి గంగారం అందిస్తున్నారు.:

voicecast:

*నిన్నటినుంచి జిల్లాలో 20 నుంచి 30 సెంటీ మీటర్ల వర్పాతమ్ నమోదుకావటంతో పలు గ్రామాలు, పట్టణాల్లో నివాస ప్రాంతాలు నీటమునిగాయి. మెదక్ నుంచి కామారెడ్డి వెళ్లే రహదారి కొట్టుకుపోవడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మెదక్ పట్టణంలో సాయి నగర్ కాలనీలో ఇళ్లల్లోకి నీరు చేరింది. రామయంపేట పట్టణ కేంద్రంలో ఐటిఐ మహిళా డిగ్రీ కళాశాల లోకి నీరు చేరింది. ఎస్టీఆర్ ఎఫ్ బృందాలు వారిని తాళ్ళసాయంతో సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. రాజ్ పేట గ్రామంలో రెస్క్యూటివ్ ఎనిమిది మందిని రక్షించగా, ఇద్దరు గల్లంతయ్యారు. జిల్లాలో సర్జన గ్రామ వాసులు 500 మందికి పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం కల్పించారు. జిల్లాలోని పోచారం డ్యామ్ ప్రమాదకర స్థాయిలో వరద నీటితో నిండింది. భారీ కురూస్తున్న వర్షం నేపథ్యంలో జిల్లాలోని విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. ప్రత్యేక*

*అధికారి హరీష్ సమీకృత కార్యకర్త కార్యాలయంలో జిల్లాలోని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.*

పిటిసి మెదక్

వర్షాలు..నిర్మల్

నిర్మల్ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలకు పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎగువ ప్రాంతాల నుంచి కడెం ప్రాజెక్టు, గడ్డెన్న వాగు, స్వర్ణ వాగు, శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ లకు చేరుతున్న నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో పలు గ్రామాలు నీట మునిగాయి. వదర పరిస్థితిపై మా ప్రతినిధి గోల సాయన్న మరిన్ని వివరాలు అందిస్తున్నారు.

Voicecast:

*నిన్నటినుంచి జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు నిర్మల్ పట్టణంలోని బంగాల్పేట్, నాయుడు వాడ, ఈద్గాం,దివ్యనగర్, శివాజీ చౌక్, జీఎన్ఆర్ ప్రియ దర్శిని నగర్ కాలనీలు ముంపునకు గురయ్యాయి. భైంసా గడ్డేన్న వాగు బ్యాక్ వాటర్ రావడం తో గుండెగాం వాసులను పునరావస కేంద్రాలకు తరలించి సహాయ చర్యలు అందిస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 25 గేట్ల తెరచి నీటిని విడుదల చేయడంతో, లక్ష్మణ చందా మండలానికి చెందిన ముగ్గురు బర్ల కాపరులు గోదావరి నదిలో చిక్కుకోగా, ఇద్దరిని సహాయ బృందాలు సురక్షితంగా ఒడ్డుకు చేర్చాయి. సోన్ మండలం మాదాపూర్ గ్రామం దగ్గర స్వర్ణ వాగు పొంగి పొర్లుతోంది. ఒకే కుటుంబానికి చెందిన 5గురు వాగులో చిక్కుకుపోవటంతో వారిని సహాయ బృందాలు సురక్షిత ప్రాంతానికి తరలించాయి. భారీ వర్షాల నేపథ్యంలో పాఠశాలలకు శలవు ప్రకటించారు. జిల్లా అధికారులు సహాయ కార్యక్రమాల్లో నిమగ్నం కావాలని ఆదేశించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారుల శలవు రద్దు చేశారు. కాగా, ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు భారీగా వస్తుండటంతో కడెం ప్రాజెక్టు, గడ్డెన్న వాగు, స్వర్ణ వాగు, శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని దిగువకు వదులుతున్నారు.*

పీటీసీ...నిర్మల్

సిఎమ్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని భారీ వర్షాలు, వరదల పరిస్థితిపై సమీక్షిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా, ముఖ్యమంత్రి ఈరోజు వరద బాధిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

డెస్క్

**BREAK**
ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు వింటున్నారు. మరిన్ని Updates కోసం హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం "ఎక్స్" handle @ airnews_hyd ని ఫాలో అవండి. AIR News Hyderabad YouTube Channel కి సబ్ స్క్రైబ్ చేయండి.

**సీతక్క - కామారెడ్డి**

ఇలా ఉండగా, కామారెడ్డి జిల్లాలో భారీ వరద పరిస్థితులపై జిల్లా ఇంఛార్జి మంత్రి సీతక్క హైదరాబాద్ నుంచి టెలికాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, ఎస్పీ తో పాటు జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షించారు. లోతట్టు ప్రాంతాలలో ముందస్తు హెచ్చరికలు జారీ చేసి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు.

పిటిసి, కామారెడ్డి

**దామోదర్ రాజనర్సింహ**

వరద ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండి, ప్రాణ, ఆస్థి నష్టం కలగకుండా చూడాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల అధికారులను ఆదేశించారు. పల్లపు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.

పిటిసి, సంగారెడ్డి

**వర్షాలు రౌండప్**

రాష్ట్రంలో గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో గత 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షం కురవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం, అర్గొండ స్టేషన్ లో 44 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కామారెడ్డి తో సహా 10 చోట్ల 20 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వరద ప్రభావిత జిల్లాల్లో 15 SDRF, 5 NDRF బృందాలు సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటున్నాయి. హైదరాబాద్ నుంచి వెళ్లిన వంద ఆర్మీ బృందాలు మెదక్ జిల్లాలో సహాయక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

కామారెడ్డి జిల్లాలో కామారెడ్డి, బీబీపేట్, రాజంపేట్, నిజాంసాగర్, ఎల్లారెడ్డి, మాచారెడ్డి మండలాలు తీవ్రంగా వరదల బారిన పడ్డాయి. బిక్కనూరు మండలం రామేశ్వరపల్లి వద్ద రైల్వే ట్రాక్ కుంగిపోవడంతో రైళ్ల రాకపోకలను నిలిపివేశారు.

నిజాంసాగర్, పోచారం ఆనకట్ట పరిధి లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. 44వ నంబర్ జాతీయ రహదారిపై మూడు చోట్ల గుంతలు పడడంతో హైదరాబాద్ నుండి ఆదిలాబాద్ వైపు వెళ్లే భారీ వాహనాలను మళ్లింపు మార్గంలో నడుపుతున్నారు.

మెదక్ జిల్లాలో 47 రహదారులు, 3 కల్వర్టులు, 15 వంతెనలపై నీరు పొంగి పొర్లుతోంది. ఆ ప్రాంతంలో పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు రాకపోకలను నియంత్రిస్తున్నారు. 16 చోట్ల చెరువులు గండి పడ్డాయి. రామాయంపేట, మెదక్ పురపాలక సంఘాల పరిధిలో 53 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అక్కన్నపేట, రామాయంపేట మధ్య షమ్నాపూర్ వద్ద రైలు మార్గం దెబ్బతినడంతో రాకపోకలు నిలిపివేశారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గంభీరావ్ పేట మండలం వద్ద అప్పర్ మానేర్ ఆనకట్ట పొంగడంతో ఐదుగురు నీటిలో చిక్కుకుపోయారు. హకీంపేట్ నుంచి ఈ ఉదయం అక్కడికి చేరుకున్న హెలికాప్టర్ భారీ వర్షం కారణంగా తిరిగి వచ్చేసింది. ఎల్లారెడ్డిపేట మండలం, బండలింగంపల్లి వద్ద అప్పర్ మానేరు వాగు పొంగి ప్రవహిస్తోంది. అక్కడ రాకపోకలు నిషేధించారు.

నిర్మల్ జిల్లాలోని 7 మండలాల్లో 3 రోజులుగా భారీ వర్షం కురుస్తోంది. నిర్మల్ పట్టణంలోని 250 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. లక్ష్మణచాంద లో ఒక వ్యక్తి చిక్కుకుపోయారు. నిర్మల్, మహారాష్ట్రను కలిపే జాం వంతెన పైనుంచి నీరు ప్రవహిస్తోంది.

సిద్దిపేట జిల్లాలో శ్రీనగర్ కాలనీ, హరిప్రియ కాలనీ  జలమయం అయ్యాయి.

నిజామాబాద్ జిల్లా హన్మాజీపేట చెరువుకు గండిపడింది. పరిసర ప్రాంతాల్లోని 200 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

పిటీసీ రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట

**వాతావరణం**

రాష్ట్రంలోని 16 జిల్లాలకు ఈ మధ్యాహ్నం వరకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ ను, మిగిలిన జిల్లాలకు ఎల్లో ఎలర్ట్ ను జారీ చేసింది. ఆదిలాబాద్, కొత్తగూడెం, భూపాలపల్లి, ములుగు, కామారెడ్డి, కొమురమ్ భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, నిజామాబాద్, పెద్దపల్లి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించింది.

డెస్క్

**వర్షాలు - ఆసిఫాబాద్**

ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెనలో ఈ ఉదయం వరకు అత్యధికంగా 85.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. పలు మండలాల్లో వాగులు పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆస్థి, ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పిటిసి, ఆసిఫాబాద్

వర్షాలు - పార్టీలు:

వర్ష ప్రభావిత ప్రాంతాలలో సహాయ చర్యల్లో పాల్గొవాల్సిందిగా వివిధ రాజకీయ పార్టీలు తమ కార్యకర్తలు నాయకులకు పిలుపునిచ్చాయి. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో సహాయ చర్యల్లో పాలుపంచుకోవాలని ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ ఇప్పటికే కోరారు. సహాయ చర్యల్లో పాల్గొనాలని BJP రాష్ట్ర అధ్యక్షుడు N రామచంద్రరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాగా BRS కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరూ సహాయక చర్యల్లో పాల్గొవాలని పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షులు K తారక రామారావు కోరారు. వరదల్లో చిక్కుకున్న వారికి, వర్షాల వల్ల నష్టపోయిన వారికి తక్షణ సాయం, నిత్యావసరాలను అందించాలనీ, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలనీ కోరారు.

MSL

**CLOSING**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు ఇంతటితో సమాప్తం. తిరిగి సాయంత్రం 6 గంటల 10 నిమిషాలకు ప్రాంతీయ వార్తలు వింటారు.